క్లుప్తంగా

యూరియా కొరత సృష్టిస్తే కఠిన చర్యలు



సొసైటీలో ఎరువులను పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

దేవరపల్లి: మండల పరిధిలోని యూరియా కృత్రిమ కొరతను సృష్టించే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటామని విజిలెన్స్ సీఐ గోపీకృష్ణ హెచ్చరించారు. దేవరపల్లి సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎరువుల దుకాణాన్ని ఆదివారం విజిలెన్స్ అధికారులు, వ్యవసాయ శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఎరువులు కొనుగోలు చేసిన రైతులకు ఇచ్చే బిల్లులు, అన్ని ఫారమ్స్, స్టాక్ రిజిస్టర్, ఎరువుల నిల్వలను అధికారులు తనిఖీ చేశారు. ఈ పోస్‌లో నమోదైన నిల్వలు, భౌతిక నిల్వలతో సరిపోల్చి పరిశీలించగా అన్ని రికార్డులు సక్రమంగా ఉన్నట్టు నిర్ధారించారు. రైతులకు అవసరానికి అనుగుణంగా మాత్రమే ఎరువులను సరఫరా చేయాలని వ్యాపారులకు తెలిపారు. రైతులు భవిష్యత్ అవసరాల కోసం ఎరువులను నిల్వ చేసుకోకుండా, ప్రస్తుత అవసరం మేరకు కొనుగోలు చేయాలని సూచించారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ తహసీల్దార్ విజయ్ కుమార్, మండల వ్యవసాయాధికారి కె.కమల్ రాజ్, గోపాలపురం మండల వ్యవసాయాధికారి ఏసుబాబు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

నిజాయితీగా పనిచేస్తేనే గుర్తింపు



మల్లేశ్వరరావును సన్మానిస్తున్న సర్పంచ్, అధికారులు

నిడదవోలు రూరల్: నిజాయితీగా పనిచేసిన ప్రభుత్వ ఉద్యోగికి ఎక్కడైన తగిన గుర్తింపు లభిస్తుందని సర్పంచ్ తిక్కా శ్రీనివాస్ అన్నారు. రూరల్ మండలం విజ్జేశ్వరం గ్రామంలో పంచాయతీ కార్యదర్శిగా పనిచేసిన ఆర్.మల్లేశ్వరరావు పదవీ విరమణ సన్మాన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. పంచాయతీ సిబ్బంది, స్థానిక నాయకులు మల్లేశ్వరరావు సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో దేవన బాబూరావు, మునికోటి దుర్గారావు, ఎన్.సత్యనారాయణ, కోయి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభం



కృష్ణంపాలెంలో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు శిక్షణ కేంద్రం

దేవరపల్లి: హెల్పింగ్ హ్యాండ్స్ వెల్ఫేర్ సొసైటీ బొల్లిన గంగరాజు జిల్లా పరిషత్ హైస్కూలు పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో మండలంలోని కృష్ణంపాలెంలో ఉచిత కుట్టు శిక్షణా కేంద్రం ఏర్పాటు చేశారు. ఈ మేరకు కేంద్రాన్ని ఆదివారం సొసైటీ సభ్యులు ప్రారంభించారు. సొసైటీ సభ్యురాలు గమ్య తనుజ మాట్లాడుతూ 45 రోజులు మహిళలకు ఉచితంగా కుట్టు శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని గ్రామంలోని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో బాలకృష్ణ, ప్రసాద్, గన్నిరాజు, ఆంజనేయులు, మానస, బ్రాహ్మణి, గ్రేసీ, వెంకన్న, పెద్దిరాజు, చంద్రశేఖర్, మురళీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



గోపవరం వద్ద స్కూటీని ఢీకొన్న ఆర్టీసీ బస్సు (ఫైల్)



సమిశ్రగూడెం చెరువు గట్టు వద్ద ప్రమాదకరంగా మలుపు



గోపవరం-డి.ముప్పవరం మార్గంలో నిలిపిన వాహనాలు

మృత్యువుకు పిలుపులు

- మలుపుల వద్ద వాహన ప్రమాదాలు
- కానరాని హెచ్చరిక బోర్డులు
- ఇప్పటికే పలువురి దుర్మరణం

నిడదవోలు రూరల్: మండలంలోని పలు రోడ్లు మూలమలుపులు ప్రమాదకరంగా మారాయి. ఏక్షణంలో ఏమి జరుగుతుందోనన్న భయం వెంటాడుతోంది. మలుపులు గమనించక విలువైన ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి. గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే రోడ్లు మలుపులు ప్రయాణికుల పాలిట మృత్యు మార్గాలుగా మారుతున్నాయి. కనీస జాగ్రత్తలు తీసుకోవడంలో ఆర్‌అండ్‌బీ అధికారులు, పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో వాహనదారులు, ప్రయాణికులు తరచూ ప్రమాదాలకు గురై ఆసుపత్రుల పాలవుతున్నారు. నిడదవోలు మండల పరిధిలో సుమారు 100 కిలోమీటర్ల ఆర్ అండ్‌బీ రోడ్లు ఉన్నాయి. ఆర్‌అండ్‌బీ శాఖ ఎలాంటి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడం, మూలమలుపుల వద్ద ఎదురుగా వస్తున్న వాహనాలు దగ్గరకు వచ్చే వరకు కనిపించక పోవడంతో పలు ప్రమాదాలు జరుగుతున్నా యి.

అరచేతిలో విద్యార్థుల ప్రాణాలు

నిడదవోలు నుంచి కానూరు వెళ్లే రోడ్డులో సమిశ్రగూడెం నందిబొమ్మ వద్ద ఆర్వోబీ బ్రిడ్జి నిర్మాణంలో ఉండటంతో గత కొంతకాలంగా వాహనాల రద్దీ విపరీతంగా పెరిగింది. ఇక్కడ ప్రైవేటు కళాశాల, పాఠశాలకు చెందిన వేలాది మంది విద్యార్థులు ప్రధానరోడ్డుపై రాకపోకలు సాగిస్తుంటారు. ఈ మలుపులో జరుగుతున్న అనేక ప్రమాదాలతో పరిసర ప్రాంతాలకు చెందిన తల్లిదండ్రులు తమ పిల్లలను స్కూళ్లకు పంపాలంటేనే భయపడుతున్నారు. సమిశ్రగూడెం బ్రిడ్జి నుంచి చెర్వు గట్టు వరకు ప్రయాణికులతో రద్దీగా ఉండే మలుపులో రాజమండ్రి నుంచి వచ్చే వాహనాలతో పాటు లారీలను అడ్డదిడ్డంగా తిప్పేయంతో పలు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. పురాతన వంతెన వద్ద పెట్టిన డివైడర్లను పలుమార్లు వాహనాలు కూడా ఢీకొట్టాయి. పోలీసులు అప్పుడప్పుడూ వాహనాల తనిఖీ చేసేటప్పుడు మినహా మిగిలిన సమయాల్లో వాహనాలు వేగంగా వెళ్లడంతో ప్రమాదాలకు ఇక్కడ నిలయంగా మారింది. నిడదవోలు నుంచి రాజమండ్రి వెళ్లే ప్రధాన రహదారిలో పెండ్యాల పంపింగ్ స్కీమ్ వద్ద మలుపు చూస్తే ప్రయాణికులు హడలిపోతున్నారు. రోడ్డుకు ఒకవైపు పిచ్చిమొక్కలతో పాటు డెల్టా కాలువ ఉండటంతో ఏ సమయంలో ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని ప్రాణాలు అరిచేతిలో పెట్టుకుని వాహనచోదకులు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

నిబంధనల ఉల్లంఘన

రాత్రివేళల్లో వీధిదీపాలు కూడా లేకపోవడంతో అనేక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. గోపవరం నుంచి డి.ముప్పవరం వెళ్లే అడ్డ రోడ్డు వద్ద మలుపులో నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా దుకాణాలతో పాటు రాజకీయ పార్టీల ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనబడటం లేదు. గతేడాది ఈ ప్రదేశంలో తణుకు నుంచి స్కూటీపై మద్దూరు వెళ్తున్న దంపతులని ఇద్దరిని ఆర్టీసీ బస్సు ఢీకొని తీవ్రగాయాలతో ఘటనస్థలంలోనే మృతిచెందారు. కొంత మంది వేగంగా వస్తూ వాహనాలను అదుపుచేయలేక మలుపుల వద్ద ప్రమాదాల బారిన పడుతున్నారు. అతిగా మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల కూడా కొందరు ప్రమాదాల బారిన పడుతున్నారు.

హెచ్చరిక బోర్డులు ఎక్కడ?

మలుపులు ఉన్న ప్రాంతం వద్ద వాహన చోదకులు అప్రమత్తమయ్యేలా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి. కానీ ప్రమాదకర మలుపులు వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడంలో విఫలమవుతున్నారు. కొన్ని రహదారుల్లో ఆటోలే ఆధారమవుతున్నాయి. మలుపులు వద్ద ఆటోలు ఇట్టే తిరగబడిపోతున్నాయని పలువురు బాధితులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి స్పీడ్ బ్రేకర్లు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేయాలని వాహనచోదకులు, ప్రయాణికులు కోరుతున్నారు.



సమిశ్రగూడెంలోని నెహ్రూ బొమ్మ సెంటర్‌లో ప్రమాదకరంగా ఉన్న వంతెన

మొద్దు నిద్రను వీడాలి



అధికారులు మొద్దు నిద్రను వీడి మలుపులు వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి. అవసరమైతే మలుపులు వద్ద విద్యుత్తు లైట్లతో హెచ్చరిక బోర్డులు ఉంటే ప్రమాదాలు తగ్గుతాయి. మలుపుల్లో ఉన్న ముళ్లపొదాలను, తుప్పలను తొలగించాలి.

– అహ్మద్ హుస్సేన్,
రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగి, సమిశ్రగూడెం

ఫ్రీజర్ బాక్స్ అందజేత



ఫ్రీజర్ బాక్స్ అందజేస్తున్న జనార్దనరావు తదితరులు

తాళ్లపూడి: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ తాళ్లపూడి మండల శాఖ చైర్మన్ సింహాద్రి జనార్దనరావు రూ.75 వేలు ఆర్థిక సాయంతో కొత్త ఫ్రీజర్ బాక్స్‌ని ఆదివారం సంస్థకు అందచేశారు. అన్నదేవరపేట ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో బాక్సర్‌ను ఉంచుతున్నామని, అవసరమైనప్పుడు వినియోగించుకొని తిరిగి బాధ్యతగా అప్పగించాలని సంస్థ మండల అధ్యక్షుడు వెలుగుబంటి శ్రీనివాసరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు వి.చంద్రయ్య, సభ్యులు హనుమంత రావు, ననపల రాజశేఖర్, సురేష్, దోశాలు, రామ్మోహన్, ఇంజరపు అబ్బు, సుబ్బారావు, వెంకటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

హుషారుగా మ్యూజికల్ నైట్

చాగల్లు: చాగల్లులో గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి తెలగా సంఘం ఆధ్వర్యంలోని గంధ్రోతు కృష్ణారావు కల్చరల్ ఆడిటోరియంలో జెమిని సినీ మ్యూజికల్ నైట్ నిర్వహించారు. మ్యూజికల్ నైట్ నిర్వాహకుడు జెమిని, మధు, సింగర్ స్వాతి తదితరులు పాడిన పాటలు శ్రోతలను ఆకట్టుకున్నాయి. యువకులు చేసిన డాన్స్‌లు అందర్నీ రంజిప చేశాయి. అనంతరం పౌరాణిక నాటక ఆణిముత్యాలులో భాగంగా గయోపాఖ్యానం, రామాంజనేయ యుద్ధం, బాల నాగమ్మ, రాజసర్తకిలో ప్రదర్శించిన పలు ప్రధాన ఘట్టాలు సభికులను ఆకట్టుకున్నాయి.

చాగల్లులో సామూహిక జ్ఞాన సరస్వతి పూజలు

స్థానిక తెలగా సంఘం వినాయకుడి ఆలయంలో చాగల్లు–నెలటూరు వర్తక సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సామూహిక జ్ఞాన సరస్వతి పూజలను చిన్నారులతో నిర్వహించారు. వేదపండితులు లింగాల శ్రీనివాస శర్మ ఆధ్వర్యంలో పరిసర ప్రాంత విద్యార్థులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

తానేటి బాబూరావుకు నాయకుల నివాళులు



బాబూరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వేణుగోపాలకృష్ణ, జక్కంపూడి రాజా, తదితరులు



తానేటి బాబూరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న భరత్‌రామ్, పార్టీ నాయకులు

దేవరపల్లి: మాజీ హోంమంత్రి, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇంచార్జి తానేటి వనిత, శ్రీనివాస్ దంపతులను ఆదివారం మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మార్గాని భరత్‌రామ్ పరామర్శించారు. వనిత మామయ్య బాబూరావు ఇటవల మరణించిన విషయం తెలుసుకుని పాలకొల్లులోని వారి నివాసానికి వెళ్లి ఆయన చిత్రపటం వద్ద పుష్పాంజలి ఘటించారు. అనంతరం వనిత కుటుంబ సభ్యులతో మాట్లాడి మరణం పట్ల సంతాపం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆయన వెంట పార్టీ నాయకలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాబూరావుకు నివాళులర్పించిన నాయకులు

నల్లజర్ల: తానేటి వనిత మామగారు బాబూరావు దశదిన కార్యక్రమం పాలకొల్లులో ఆదివారం జరిగింది. ఈ మేరకు తూర్పు గోదావరి జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో నల్లజర్ల మండల కన్వీనర్ వెల్లంకి వెంకట సుబ్రమణ్యం, జడ్పీటీసీ మాజీ సభ్యులు బంక అప్పారావు, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు నక్కాపండు, మండల మహిళా విభాగం అధ్యక్షురాలు యజ్జవరపు లక్ష్మి, బీసీ సెల్ అధ్యక్షుడు చిన్నీనాగూయాదవ్, వాణిజ్య విభాగం మండలశాఖ అధ్యక్షుడు శ్రీకాకుళపు ఆదిత్య తదితరులు హాజరయ్యారు.

వెన్నుపోటులో చంద్రబాబు దిట్ట



మద్దూరులో బాబు మోసాలను ప్రజలకు వివరిస్తున్న తలారి వెంకట్రావు, నాయకులు

తాళ్లపూడి(కొవ్వూరు): చంద్రబాబుకు వెన్నుపోటు పొడవడం, ప్రజలను మోసం చేయడం వెన్నతో పెట్టిన విద్య అని కొవ్వూరు నియోజకవర్గ కోఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. మండల పరిధిలోని మద్దూరు గ్రామంలో ఆదివారం బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. రచ్చబండలో మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, మండల నాయకులు కలిసి గత ఎన్నికల్లో చంద్రబాబు ఇచ్చిన హామీలు, ప్రస్తుతం వాటిని అమలు చేయకుండా మోసం చేస్తున్న విధానంపై గ్రామస్తులకు వివరించారు. తలారి వెంకట్రావు మాట్లాడుతూ చంద్రాబాబు పాలన అంతా మోసాలేనన్నారు. విశ్వాసం ఉన్న నాయకుడు జగన్‌మోహన్ రెడ్డి అని ఇచ్చిన అన్ని హామీలను అమలు చేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. అబద్ధపు హామీలతో ఎన్నికల్లో గెలిచి నేడు వాటిని అమలు చేయకుండ కుంటి సాకులు చెబుతున్నారని మండిపడ్డారు. మాట ఇవ్వడం తప్పడం బాబుకు అలవాటేనని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు కంఠమణి రమేష్‌బాబు, మండల కన్వినర్ వెంపాటి సురేష్, నాయకులు తోట రామకృష్ణ, ఉప్పులూరి సూరిబాబు, పరిమి సోమరాజు, సుంకర సత్యనారాయణ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముంపు బారిన వరినారు

పెరవలి: మండల పరిధిలోని అధిక వర్షాలకు ముంపు బారిన పడి వరిచేలు కుళ్లిపోతున్నాయి. కానూరు అగ్రహారం, కానూరు, పెరవలి గ్రామాల్లో పంట చేలు ముంపు బారిన పడి వరి చేలు కుళ్లిపోవటంతో రైతులు లబోదిబోమంటున్నారు. ఇప్పటికే జూలై నెలలో వచ్చిన అధిక వర్షాలకు ఒకసారి వరిచేలు పాడైపోతే మరలా నాట్లు వేశామని ఇప్పుడు మరలా కుళ్లిపోయాయని దీనితో ఏమి చెయ్యాలో తెలియటంలేదని రైతు చెల్లపల్లి రాంబాబు వాపోయారు. మరోవైపు రొయ్యల చేరువులతో పంట దెబ్బతింటుందని గత 5 ఏళ్ల వైసీపీ పాలనలో ఒక్క చెరువు తవ్వకాలకు అనుమతులు ఇవ్వలేదని, కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత నాయకులే కాలయముళ్ల తయారై దౌర్జన్యంగా చెర్వులను తవ్వేస్తున్నారని తెలిపారు. ఒకవైపు ప్రకృతి పగబెట్టినట్లు వర్షాలు, వరదలతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే, మరో వైపు ఈ అక్రమ చెర్వుల తవ్వకాలు భయపెడుతున్నాయని ఆందోళన చెందుతున్నారు. పంట చేలు ముంపు బారిన ఉండేందుకు వెంటనే ఉసులుమర్రు నుంచి కానూరు వరకు మురుగు కాల్వలను తవ్వకాలు చేయాలని పరిసర ప్రాంత రైతులు డిమాండ్ చేస్తున్నారు.



తీపర్రు పుష్కరాల రేవులో పరమేశ్వరుడును తాకిన వరద

ఉగ్ర గోదావరి

గోదావరికి ఈనెలలో రెండో సారి వరద పోటెత్తటంతో దిగువ లంకలో పంటలన్నీ నీటమునగడంతో లంక రైతులు ఆందోళన చెందుతున్నారు. వారం రోజులు క్రితం వచ్చిన ఉగ్ర గోదావరికి తీవ్ర నష్టాలు తెచ్చిన వరద, ఇప్పుడు మరలా రావటంతో లంక రైతులు లబోదిబోమంటున్నారు.ఎగువ ప్రాంతాల్లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరికి వరద పోటెత్తటంతో లంక రైతులు దిక్కుతోచని స్థితిలో అల్లాడుతున్నారు. పెరవలి మండలంలో కానూరు, కానూరు అగ్రహారం, ఉసులుమర్రు, తీపర్రు, కాకరపర్రు, ఉమ్మిడివారిపాలెం, ఓదూరివారిపాలెం, ముత్యాలవారిపాలెం, ముక్కామల, లంకమాలపల్లి, ఖండవల్లి, మల్లేశ్వరం గ్రామాల్లో 900 ఎకరాల్లో దిగువ లంకల్లోని పంటలు నీటమునిగాయి.



కానూరు గ్రామంలో మురుగు పారక కుళ్లిపోయిన వరిచేను

పదవీ విరమణ జీవితంలో భాగం

నల్లజర్ల: దూబచర్ల డైట్ కళాశాలలో సీనియర్ అధ్యాపకులు యస్.ఆర్.సుబ్రమణ్యం పదవీ విరమణ కార్యక్రమం కళాశాలలో ప్రిన్సిపాల్ యం.కమలకుమారి అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాలుగు దశాబ్దాలుగా పాఠశాల విద్యాశాఖలో గణిత ఉపాధ్యాయుడిగా, మండల విద్యాశాఖ అధికారిగా, డైట్ లెక్చరర్‌గా, ప్రిన్సిపాల్ అనేక హోదాలలో పనిచేసిన ఆదర్శనీయుడు సుబ్రహ్మణ్యం అని కొనియాడారు. ఉద్యోగులకు పదవి విరమణ జీవితంలో సర్వసాధరణమని పేర్కొన్నారు. అనంతరం దంపతులను అధ్యాపకులు, రిటైర్డు ఉద్యోగులు, సిబ్బంది ఘనంగా సత్కరించారు. రిటైర్డు ప్రిన్సిపాల్స్ ,జిల్లా విద్యాశాఖాధికారులు డి.బూరయ్య, కె.చంద్రకళ, ఏ.జయసూర్య ప్రకాశ రావు, టి.ఎస్.శాస్త్రి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



అధ్యాపకుడు సుబ్రహ్మణ్యం దంపతులను సత్కరిస్తున్న కళాశాల సిబ్బంది

వైభవంగా గణపతి నవరాత్రి ఉత్సవాలు



భూపతి ఆదినారాయణ, సీఐ తిలక్ తదితరులను సత్కరిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

నిడదవోలు: పట్టణంలోని గణేష్ చౌక్ సెంటర్లో వేంచేసియున్న పూజా గణపతి, కుమారస్వామి ఆలయం వద్ద ఐదవ రోజు ఆదివారం నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. హైదరాబాదు నుంచి తీసుకువచ్చిన సుమారు 18 అడుగుల వినాయక విగ్రహం వద్ద భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. సుమారు 40 మంది వినాయక మాల ధరించిన భక్తులు స్వామివారిని ప్రత్యేక పూజలు చేస్తున్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు కారింకి సాయిబాబు ఆధ్వర్యంలో 103 వార్షికోత్సవ ఉత్సవాలను ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా శనివారం మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, నిడదవోలు సీఐ పివిజి తిలక్, పట్టణ ఎస్సై జగన్మోహన్ రావు, జనసేన నాయకులు డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి తదితరులు మండపాన్ని దర్శించారు. అనంతరం ఉత్సవ కమిటీ సభ్యులు ప్రత్యేక పూల కిరీటాలు, దుశ్శాలువాలతో సత్కరించారు. భక్తులు, యువత ఉత్సాహంగా ఫోటోలు, సెల్ఫీలు తీసుకోవడానికి పోటీ పడుతున్నారు. ఆలయానికి ఇరువైపులా ఏర్పాటుచేసిన భారీ సెట్టింగులు, వివిధ దేవత మూర్తుల విద్యుత్ దీపాలంకరణ భక్తులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. ఆలయ కమిటీ అధ్యక్షుడు కారింకి సాయిబాబు మాట్లాడుతూ సెప్టెంబర్ 6న ఊరేగింపులో భాగంగా బాణసంచా కాల్పులు, విచిత్ర వేషధారణలు, కోయ డాన్సులు, రాక్షస వద, సన్నాయి తాళాలు, మ్యూజికల్ బ్యాండ్లతో ఊరేగింపు నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడించారు.



బ్రాహ్మణగూడెంలో గణనాథుడుని ట్రాక్టర్‌పై ఊరేగిస్తున్న ఉత్సవ కమిటీ

ఉత్సవంగా నిమజ్జనం

నిడదవోలు రూరల్ (నిడదవోలు): గణనాథుడి నిమజ్జనం వేడుకలను నిడదవోలు మండలంలోని డి.ముప్పవరం, శెట్టిపేట, సమిశ్రగూడెం గ్రామాల్లో ఆదివారం ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు ఘనంగా నిర్వహించారు. ఉత్సవ విగ్రహాలను నిమజ్జనం చేశారు. యువకులు, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొని గణేష్ మహారాజ్‌కి జై..అంటూ సందడి చేశారు. గోపవరంలో ఏర్పాటు చేసిన డప్పు విన్యాసాలు, తీన్‌మార్, బాణసంచా కాల్పులు ఆకట్టుకున్నాయి. సిద్ధి వినాయకుడిని గ్రామ పురవీధుల్లో పూలవాహనంపై ఊరేగించారు. ఉండ్రాజవరం మండలం తాడిపర్రులో కరికాల భక్తుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఊరేగింపులో కొండేటి సురేష్ అనే భక్తులు ఒంటికి సూలాలు ధరించి తాడుతో వినాయకుని రథాన్ని లాగి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాడు. కమిటీ సభ్యులు నాని, రఘు, మోటుపల్లి ఆంజనేయులు, తిరుగు భీమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జనంలో అపశ్రుతి..

నిడదవోలు మండలం సమిశ్రగూడెం పశ్చిమడెల్టా కాలువ వద్ద జరిగిన వినాయక నిమజ్జనాల్లో అపశృతి చోటుచేసుకుంది. జేసీబీ కట్టిన తాడు తెగిపోవడంతో ఇద్దరు వ్యక్తులు జారిపడిపోయారు. వారికి ఎటువంటి తీవ్రగాయాలు కాకపోవడంతో పోలీసులు, ఉత్సవ కమిటీ సభ్యులు ఊపిరిపీల్చుకున్నారు.

వాడవాడలా నిమజ్జనోత్సవాలు

నల్లజర్ల: వినాయక చవితి ఉత్సవాలలో భాగంగా ఐదవ రోజు ఆదివారం గ్రామ గ్రామాన నిమజ్జనోత్సవాలు ఘనంగా జరిగాయి. ఉదయం ప్రారంభమైన ఊరేగింపులు రాత్రి వరకు కొనసాగాయి. ఆయా ఊరేగింపులలో విచిత్ర వేషాలు, బుట్టబొమ్మలు, కొర్రగేడెలు, భేతాళ డ్యాన్సులు, బ్యాండు మేళాలు, తీన్‌మార్ డప్పులతో వైభవంగా జరిగాయి. తెలికిచెర్ల కొత్తపేటలో లక్ష్మీగణపతికి విశిష్ఠ పూజల అనంతరం నిమజ్జనోత్సవం ప్రత్యేక ఆకర్షణగా నిలచింది. ఊరేగింపులో యువకులు ప్రత్యేక నృత్యాలు చేస్తూ పాల్గొన్నారు.

వెళ్లి రావయ్యా..గణపయ్య

చాగల్లు: వినాయక నిమజ్జన కార్యక్రమాలు ఆదివారం మండలంలో పలు గ్రామాల్లో సందడిగా సాగాయి. చాగల్లు, ఊనగట్ల, బ్రాహ్మణగూడెం గ్రామాల్లో నిమజ్జనోత్సవాలు ఎటువంటి అపశ్రుతులు చోటుచేసుకోకుండా కార్యక్రమాలు నిర్వహించారు. బ్రాహ్మణగూడెం నడివీధి సెంటర్లో ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహ నిమజ్జనం డప్పు వాయిద్యాల నడుమ గణపతిని ఊరేగించి గ్రామంలోని ఉన్న చెరువులో నిమజ్జనం చేశారు. ఊనగట్లలో బుట్టబొమ్మలు, డప్పు వాయిద్యాలతో స్వామి వారిని గ్రామంలో ఊరేగించి ఉత్సాహంగా నిమజ్జనం చేశారు. చిక్కాల, కలవలపల్లిలో బుట్టబొమ్మలు, డప్పు వాయిద్యాలతో స్వామి వారిని గ్రామంలో తీన్‌మార్ డప్పులు, బుట్ట బొమ్మలతో గ్రామంలో స్వామివారిని ట్రాక్టర్‌పై ఊరేగించి నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో యూత్, ఉత్సవ కమిటీ నిర్వహకులు పాల్గొన్నారు. మల్లవరంలో వినాయకుడి విగ్రహ నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు.



తాడిపర్రులో శరీరానికి శూలాలు ధరించి రథాన్ని లాగుతున్న భక్తుడు

అన్న సమారాధన..

బ్రాహ్మణగూడెంలో జగనన్న కాలనీలో వినాయకుని ఆలయం వద్ద భారీ అన్న సమారాధనను ఆదివారం నిర్వహించారు. బ్రాహ్మణగూడెం, ఎస్.ముప్పవరం, గరప్పాడు గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాన్ని స్వీకరించారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లను పర్యవేక్షించారు.